

ప్రస్తుతం ఆరిలోవ

వావ్.. ఆరిలోవ

- పల్లె.. పట్నంగా మారిన వేళ..
- అందుబాటులో కార్పొరేట్ వైద్యం
- ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు ఇక్కడే..



1990 ప్రాంతంలో ఆరిలోవ

ఆరిలోవ.. ఒకప్పుడు చిన్న పల్లె.. చుట్టూ పచ్చని పంట పొలాలు, చెట్లు.. ఆహ్లాదకరమైన వాతావరణం. నగరానికి కొద్ది దూరంలో ఉండేది. పిల్లలు చదువుకోవడానికి ఎక్కడో ఓ పాఠశాల ఉండేది. ఇక్కడి నుంచి నగరానికి వెళ్లాలంటే.. గెడ్డలు, వాగులు, పంట పొలాలు దాటాల్సిందే. మరి ఇప్పుడు.. విశాఖ నగరంలో ప్రధాన ప్రాంతంగా ఎదిగింది. పాకల స్థానంలో భవంతులు వెలిశాయి. విశాలమైన రోడ్లు, **విద్యాలయాలు, కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలకు కేంద్రంగా మారింది. హరిలోయ.. ఆరిలోవగా ఎలా మారింది? చిన్న పల్లెలో ఈ మార్పులు ఎలా సాధ్యమయ్యాయి? ఈ వివరాలు తెలియాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే..!** – ఆరిలోవ



చినగదిలి నుంచి ఆరిలోవకు వెళ్లే డబుల్ రోడ్డు

1980 కంటే ముందు ఆరిలోవ చిన్న పల్లెటూరు. ఈ పల్లెలో సుమారు 300 వరకు కమ్మల పాకలు ఉండేవి. దీనికి ఓ కిలో మీటరు దూరంలో పెదగదిలి, చినగదిలి, మరో మూడు కిలోమీటర్ల దూరంలో హనుమంతవాక ఉండేది. ఇవన్నీ చిన్న చిన్న గ్రామాలే. ఈ గ్రామాల్లో సుమారు 70 శాతానికి పైగా యాదవులే. మిగిలిన వారు ఎస్సీ, రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఇతర సామాజిక వర్గాల వారు ఉండేవారు. ఇక్కడ ప్రజలు వ్యవసాయం, పాడి పశువులు పెంపకం, చేతి వృత్తులపైనే ఆధారపడేవారు. ఈ పల్లెకు చుట్టూ పచ్చని కొండలు, మధ్యలో వాగులు, గెడ్డలు ఉండేవి. కొండల మధ్య లోయలో ఉన్న ఈ ప్రాంతాన్ని అప్పట్లో హరిలోయ అని పిలిచేవారు. క్రమంగా ఆ పేరు ఆరిలోవగా మారింది. నగరం అంటే అప్పట్లో జగదాంబ. రోడ్లు లేకపోవడంతో పొలం గట్లపై నుంచి నడుచుకుంటూ.. వాగులు, గెడ్డలు దాటుకుంటూ జగదాంబ చేరుకునేవారు. ఇక్కడ ప్రజలు వైద్యం కోసం కేజీహెచ్‌కు వెళ్లాలంటే నానా పాట్లు పడేవారు. గ్రామంలో ఎక్కడా రోడ్లు ఉండేవి కాదు. నివాసాలు కూడా అక్కడక్కడా ఉండేవి. మధ్యలో విశాలమైన స్థలాల్లో పిల్లలు ఆటలాడుకునేవారు. సంక్రాంతి, దీపావళి, ఉగాది తదితర ముఖ్యమైన పండగల సమయంలో అంతా ఓ చోట చేరి.. ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకునేవారు.

సూర్యతేజానగర్.. ఒకప్పుడు మురికివాడ

ఒకప్పుడు సూర్యతేజానగర్ మురికివాడగా ఉండేది. ఇప్పుడు దాని రూపురేఖలు మారిపోయాయి.



గోల్ఫ్ మైదానం

ఇక్కడ అన్నీ కమ్మల పాకలే ఉండేవి. ఇళ్ల మధ్య ఉన్న చిన్న సందులు లాంటి దారిలో కాలనీవాసులు నడిచేవారు. **కేంద్ర ప్రభుత్వం 2012లో రాజీవ్ ఆవాస్ యోజన(రే) పథకం కింద ఈ కాలనీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా 204 పక్కా నివాసాలు నిర్మించింది. ఆ నివాసాల మధ్య విశాలమైన రోడ్లు, విద్యుత్ దీపాలతో ఈ కాలనీ ఇప్పుడు కళకళలాడుతోంది.** దీని పక్కనే సెంట్రల్ లైటింగ్‌తో 60 అడుగుల డబుల్ రోడ్డును ఇటీవల జీవీఎంసీ నిర్మించడంతో.. ఈ కాలనీకి మరింత ప్రాధాన్యం పెరిగింది.

ప్రత్యేక ఆకర్షణగా గోల్ఫ్ క్లబ్

ముడసర్లోవ వద్ద 20 ఏళ్లుగా గోల్ఫ్ క్లబ్ నిర్వహిస్తున్నారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో పచ్చని మైదానంలో గోల్ఫ్ క్రీడ ఆడుతుంటారు. దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఐపీఎస్‌లు, బడా వ్యాపారవేత్తలు ఈ క్లబ్‌లో సభ్యులు. ఇందులో సభ్యత్వం కోసం రూ.లక్షలు చెల్లిస్తారు. ప్రతి రోజూ తెల్లవారేసరికి ఖరీదైన కార్లలో ఇక్కడ దర్శనమిస్తుంటారు.

మారిన రూపురేఖలు

ఇప్పుడు ఆరిలోవ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పల్లె వాతావరణం పోయి పట్టణంగా మారింది. కమ్మ పాకలు కనుమరుగై భవంతులు వెలిశాయి. మురుగు కాలువలు, బురద వీధుల స్థానంలో విశాలమైన సీసీ, బీటీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణం జరిగింది. 1985లో పునరావాసం కింద ఆరిలోవను ఆనుకుని రెవెన్యూకి చెందిన కొన్ని ఎకరాల ఖాళీ స్థలాల్లో రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్ వేసింది. నగరంలోని మురికి వాడల్లో నివాసం ఉండే వారికి అందులో స్థలాలు కేటాయించింది. 90, 60, 40 చదరపు గజాల చొప్పున ఇళ్లు లేని పేదలకు కేటాయించడంతో.. ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు మొదలయ్యాయి. అలా గాంధీనగర్, బాలాజీనగర్, డ్రైవర్స్ కాలనీ, ముస్తఫా కాలనీ, భరత్‌నగర్, అంబేడ్కర్ నగర్, పార్వతీనగర్, సూర్యతేజానగర్, విద్యా నగర్, నెహ్రూనగర్, దుర్గానగర్, రాజీవ్ నగర్, దుర్గాబజార్, ఆపరేషన్‌కాలనీ, ఆరిలోవ కాలనీ, పాండురంగాపురం, కనకమహాలక్ష్మినగర్, నలభై గజాల రోడ్డు, శివాజీనగర్, లక్ష్మీపార్వతీ నగర్, తదితర కాలనీలు వెలిశాయి. క్రమంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి ప్రజలు వలసలు వచ్చారు. అలా నివాసాలు.. ఇక్కడ నివసించే ప్రజల సంఖ్య పెరుగుతూ వస్తోంది. విద్య, వైద్య, వ్యాపార సదుపాయాలు పెరగడంతో అపార్టుమెంట్లు వెలుస్తున్నాయి. ప్రస్తుతం ఆరిలోవ ప్రాంతాన్ని జీవీఎంసీ మూడు వార్డులుగా విభజించింది. 11, 12, 13 వార్డుల్లో సుమారు 22,000 నివాసాలు, 80,000కు పైగా జనాభా నివాసం ఉంటున్నారు.

2005 తర్వాత.. మహర్దశ

2005 తర్వాత ఈ ప్రాంతానికి మరింత మహర్దశ పట్టింది. ఇక్కడ 200 ఎకరాల్లో హెల్త్ సిటీ, విమ్స్ ఆస్పత్రి, హనుమంతవాక నుంచి అడవివరం వరకు 200 అడుగుల వెడల్పుతో ఐదు లైన్ల బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణాలు జరిగాయి. హెల్త్‌సిటీలో అపోలో, కేర్, పినాకిల్, క్యూ-1, రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి తదితర కార్పొరేట్ ఆస్పత్రులు ఇక్కడ అందుబాటులోకి వచ్చాయి. ముడసర్లోవ పార్కు, ముడసర్లోవ రిజర్వాయర్ ఇక్కడ ప్రజలకు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. ఇక్కడ కేంద్ర కారాగారం, దీని పక్కనే శ్రీకృష్ణాపురంలో ఏపీ గురుకులం, పైనాపిల్‌కాలనీలో జిల్లా మహిళా ప్రాంగణం, సీఐడీ రీజనల్ కార్యాలయం, ముడసర్లోవ వద్ద రీజనల్ వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం(జీఎస్టీ), ప్రభుత్వ బాలుర గృహం, చినగదిలిలో హెల్త్‌సిటీ, హనుమంతవాక వద్ద విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్), ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు ఏర్పాటయ్యాయి. జనం పెరగడంతో సిటీ బస్‌లు, ఆటోలు నిత్యం తిరుగుతుంటాయి. ఆరిలోవ నుంచి రైల్వేస్టేషన్‌కు 69 నంబర్ సిటీ బస్‌లు, పాత పోస్టాఫీస్‌కు 60 నంబర్ సిటీ బస్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి.



హెల్త్‌సిటీలో విస్తరించిన ఆస్పత్రులు

క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయ సాధకుడు సీఎం జగన్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పల్లా దుర్గారావు, నేతలు

బీచ్‌రోడ్డు: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయ సాధకుడు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కొనియాడారు. విజయవాడలో భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన నేపథ్యంలో రామ్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాపాక శ్రీనివాసరావు, తోటపల్లి శ్రీనివాసరావు, సంపంగి సురేష్, బొండాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పార్క్ సందర్శన



మొక్కల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని శుక్రవారం ఒడిశాలోని బరంపురంనకు చెందిన రోలాండ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ విద్యార్థులు సందర్శించారు. కళాశాల ఆచార్యులు డాక్టర్ జితిన్ మిశ్ర, దిగంబర్ బిష్ణోయ్‌తో కూడిన 50 మంది విద్యార్థులు పార్కును పరిశీలించారు. ఇక్కడి వందలాది మొక్కల ప్రత్యేకత, ఔషధ విలువల గురించి తెలుసుకున్నారు. పార్క్ విశిష్టతను నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి వారికి వివరించారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేత పీతలవానిపాలెం



పీతలవానిపాలెం టీమ్‌తో అధికారులు

ఎంవీపీకాలనీ: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఏయూ ఇండోర్ జిమ్నాజియం వేదికగా శుక్రవారం మండలస్థాయి షటిల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. జీవీఎంసీ 22వ వార్డు పరిధిలోని పలు జట్ల మధ్య ఈ పోటీలు జరగ్గా.. పీతలవానిపాలెం(151 సచివాలయం) జట్టు విజేతగా నిలిచింది. మండల స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయిలో తలపడతారు. కేడీపీఎం స్కూల్ పీఈటీ రత్నం, సచివాలయం ఎడ్యుకేషన్ కార్యదర్శి ఝాన్సీ ఈ పోటీలను పర్యవేక్షించారు. షటిల్ బ్యాడ్మింటన్‌తో పాటు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు. పలువురు జీవీఎంసీ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అలాగే స్వామి వారి సహస్ర నామార్చన విశేషంగా నిర్వహించారు. 1001 నామాలతో స్వామికి తులసి పూజ చేశారు.

వైఎస్సార్ సీపీ గెలుపే మనందరి లక్ష్యం

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ గెలుపే మనందరి లక్ష్యం కావాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న 'జనంలో జనం కోసం'పాదయాత్ర 21వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శుక్రవారం 18వ వార్డులో పర్యటించారు. అంజయ్యనగర్, గోవా గార్డెన్, గొల్లవీధి ప్రాంతాల్లో వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మితో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఎంపీకి ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఇంటా అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు ఉపయుక్తంగా నిలిచాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పాదయాత్రలో పార్టీ నేతలు పాల్గొన్నారు.



ఎంపీ ఎంవీవీకి హారతి పడుతున్న మహిళలు

వైభవంగా సహస్ర దీపాలంకరణ



ప్రత్యేక పూజలు అందుకున్న సీతారాములు

ఎంవీపీకాలనీ: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకుని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం కొనసాగాయి. ఎంవీపీకాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా సీతారాములకు సహస్ర దీపాలంకరణ చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామికి ప్రత్యేక హారతిని కనువిందుగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

మద్దిలపాలెం: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఎంవీపీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ఎస్.వి.ప్రసాద్ ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. డిపో మేనేజర్ అరుణ్‌కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిగ్నల్స్ వద్ద నిబంధనలు పాటించాలని, నగర పరిధిలో 25 కిలోమీటర్లకు మించి వేగంతో వాహనాలు నడపవద్దని సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీపీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని భానోజీ నగర్ ప్రాంతంలో 388 జీవో ప్రకారం రిజిస్ట్రేషన్ అయిన ఇళ్ల పత్రాలను వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా పట్టాలు ఉన్నా.. బ్యాంక్‌లో రుణాలు, అమ్మకం, ఇంటి పన్ను, నీటి పన్నులు చెల్లింపులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అలాంటి వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 388 జీవో ద్వారా లబ్ధి చేకూర్చారన్నారు. భానోజీనగర్ సచివాలయం కార్యదర్శి పొట్నూరు నరసింగరావు, కొండ్రు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు పత్రాలు అందజేస్తున్న పల్లా దుర్గారావు

వేమన పద్యం అజరామరం



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, అతిథులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రజాకవి వేమన జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అతిథులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశానికి తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య మాట్లాడుతూ సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతలపై వేమన అక్షరాయుధంతో చైతన్యం కలిగించారన్నారు. మానవ జీవన విధానాన్ని ప్రతి కోణంలోనూ ఆయన పద్యాలు స్పృశించాయని.. అందుకే వేమన ప్రజాకవిగా పేరుగాంచారన్నారు. తెలుగు విభాగ సీనియర్ ఆచార్యుడు ఆచార్య జి.యోహాన్ బాబు మాట్లాడుతూ వేమన పద్యాలు క్లుప్తంగా ఉన్నప్పటికీ.. అందులోని భావార్థం చాలా విస్తృతమైనదన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ జానపద సాహిత్యాన్ని ఆదరించినట్లు.. వేమన సాహిత్యాన్ని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. తెలుగు సాహిత్యంలో ఆయన పద్యాలు అజరామరంగా నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, కె.రత్నశేఖర్, డాక్టర్ పి.లావణ్య, డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎల్.గిరీష్ కుమార్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో కూలిన రక్షణ గోడ

- 4 బైక్‌లు ధ్వంసం



కూలిన రక్షణ గోడను పరిశీలిస్తున్న వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, జీవీ

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం వద్ద శుక్రవారం రిటర్నింగ్ వాల్ కూలిపోయింది. ఈ ఘటనలో నాలుగు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. రోడ్డు మార్గానికి అడ్డంగా రక్షణ గోడ పడిపోవడం వల్ల వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు.. టౌన్ ప్లానింగ్ సిబ్బందితో డెబ్రిస్‌ను తొలగించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జీవీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్ట నివారణ చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు సూచించారు. గ్రామపెద్దలు బుగత యేసురత్నం, గొలగాని త్రినాథ్, అనకాపల్లి ధర్మ, లక్ష్మణ్, హరి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే.. అసత్య ప్రచారాలు

- ఏయూను మోడల్ వర్సిటీగా తీర్చిదిద్దిన ఘనత ప్రసాదరెడ్డిదే..
- అకడమిక్ డీన్ ఆచార్య కిశోర్‌బాబు



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంత మంది అసత్యాలను ప్రచారం చేస్తున్నారని.. వీటిని కొన్ని పత్రికలు పనిగట్టుకుని ప్రచురించడం సరికాదని ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన బహిరంగ ప్రకటన విడుదల చేశారు. ఏయూను మోడల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దిన ఘనత ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డికే దక్కుతుందన్నారు. నాలుగేళ్ల కాలంలో ఏయూను సమగ్రంగా అభివృద్ధి చేసిన విధానం దేశానికే ఆదర్శమన్నారు. కేంద్రీయ, జాతీయ విద్యా సంస్థలకు దీటుగా ఏయూను తీర్చిదిద్దారని కొనియాడారు. వీటిని చూసి.. వాస్తవాలు తెలుసుకుని.. పత్రికలు కథనాలు ప్రచురించాలని సూచించారు. ఎవరో.. ఎక్కడో మాట్లాడిన అసత్యాలను ప్రచారం చేస్తూ.. విశ్వవిద్యాలయ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించడం తమను బాధిస్తోందన్నారు. ఏయూకు రెండో పర్యాయం ఉపకులపతిగా ఆచార్య ప్రసాదరెడ్డి రావడాన్ని అందరం స్వాగతిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతే పరమావధిగా పనిచేస్తున్న ఆచార్య ప్రసాదరెడ్డిపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలు ప్రచురించడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

ఎంవీపీకాలనీ: భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రాంకుమార్ అన్నారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విశాఖ అభివృద్ధికి ఎనలేని కృషి జరిగిందన్నారు. విశాఖను స్మార్ట్ సిటీగా ఎంపిక చేసి వందల ప్రాజెక్టుల ద్వారా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం బాటలు వేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే స్థాపించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నేక్) ద్వారా నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ అందజేస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకం కింద ఉచిత శిక్షణ, ఉపాధి నిమిత్తం నేరుగా అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దీనికి పది పాసైన వారు అర్హులని, ఈ శిక్షణ రెండు మాసాలు ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 83090 59974 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM

E.P.No.312/2017 IN O.S.No.233/2012

Between

M/s Sai Annapurna Bio-Proteins Private Limited Rep. by its Managing Director, Vemuri Krishna Prasad, Vijayawada ...D.Hr.

And

Sajja Radha Krishna, Proprietor, M/s Keerthi Enterprises, D.No.2-175, Indira Gandhi Nagar, Old Dairy Farm, Visakhapatnam-530040 ...J.Dr.

AUCTION / SALE NOTICE

To

Sajja Radha Krishna. Proprietor, M/s Keerthi Enterprises. D.No. 2-175, Indira Gandhi Nagar, Old Dairy Farm, Visakhapatnam-530040

The below mentioned goods are going to be auctioned by the court Ameen on 31.01.2024 at 10:30am at Visakhapatnam District Court Premises.

No.	వస్తువులు	అంచనా విలువ
01	Sofa Sets (2 long sitting - 6 Single Sitting Chairs)	Rs.20,000-00
02	Teapay (4 Steel Pillars + Glass Top)	Rs.1,500-00
03	Samsung TV (42 Inches)- Old	Rs.15,000-00
04	Samsung TV (32 Inches)- Old	Rs.10,000-00
05	Reconnect TV (34 Inches)- Old	Rs.12,000-00
06	Samsung A/c-Old	Rs.15,000-00
07	Samsung A/c-Old	Rs.15,000-00
08	Daikin A/c- Old	Rs.15,000-00
09	Daikin A/c- Old	Rs.15,000-00
10	Iron Bearwas-Old	Rs.20,000-00
11	Wooden Dining Table + 6 Chairs-Old	Rs.20,000-00
12	Ceiling Fans-5 Nos. -Old	Rs.2,500-00
13	Office Chair-1 No. -Old	Rs.2,000-00
14	Wooden Chairs-2 Nos. -Old	Rs.1,500-00
15	L.G.Washing Machine-1 No. -Old	Rs.20,000-00
	TOTAL (Rupees One lakh eighty four thousand five hundred only)	**Rs.1,84,500-00**

(By order of the Honourable Principal District Judge Court, Visakhapatnam)

Date: 10-01-2023
Visakhapatnam

D.VENKATA LAKSHMI ARRABOLU
ARRABOLU SAI NAVEEN
M.KULA DEEPIKA ARRABOLU
Advocates
F.No. 101, Arabolu Paradise, Dwaraka Nagar, Visakhapatnam., Cell No. **9440191914**